AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
29-4-2026 (Wednesday) MAIN EDITION

## ఇరాన్ పోస్ట్‌పై బ్రిటన్ ఆగ్రహం



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** అమెరికా, ఇజ్రాయెల్‌లతో ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ, బ్రిటన్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం చేసిన పోస్ట్ తీవ్ర వివాదానికి దారితీసింది. శత్రువుల ముందు తలవంచే ప్రసక్తే లేదని, దేశం కోసం ప్రాణ త్యాగం చేసేందుకు సిద్ధంగా ఉండాలని యూకేలో ఉంటున్న తమ దేశ పౌరులకు ఎంబసీ పిలుపునిచ్చింది. దేశాన్ని శత్రువులకు అప్పగించే కంటే బలిదానానికి సిద్ధపడటం మేలని, స్వచ్ఛందంగా ప్రాణాలు అర్పించే వారు తమను సంప్రదించాలని ఎంబసీ తన పోస్ట్‌లో పేర్కొంది. ఈ పోస్ట్ ప్రజలను రెచ్చగొట్టేలా ఉందంటూ బ్రిటన్ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. బ్రిటన్ గడ్డపై ఉంటూ ఇలాంటి హింసాత్మక ప్రేరేపిత వ్యాఖ్యలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

## టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేశ్ ప్రమాణం



**అక్షరటుడే, ఏపీ:** ఆంధ్రప్రదేశ్ రాజకీయ యవనికపై తెలుగుదేశం పార్టీ తన కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం వేదికగా టీడీపీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం అత్యంత ఘనంగా జరిగింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నూతన కార్యవర్గంతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మంత్రి నారా లోకేశ్ బాధ్యతలు స్వీకరించారు. పొలిట్ బ్యూరోతో పాటు జాతీయ, రాష్ట్ర కమిటీల సభ్యులంతా కార్యక్రమంలో ప్రమాణం చేశారు.

### కాశీ విశ్వనాథ ఆలయంలో మోదీ పూజలు



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కాశీ విశ్వనాథ ఆలయాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. పలు అభిషేకాలు నిర్వహించారు. అంతకు ముందు ఆలయ అధికారులు, పండితులు స్వాగతం పలికారు.

### కవితకు డిపాజిట్ కూడా రాదు: రాజగోపాల్‌రెడ్డి



**అక్షరటుడే, హైదరాబాద్:** కవిత రాజకీయ పార్టీ పెట్టడం హాస్యాస్పదమని కాంగ్రెస్ నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఆమె సొంతంగా పోటీ చేస్తే.. డిపాజిట్ కూడా రాదని ఎద్దేవా చేశారు. ఉద్యమకారుడి బిడ్డగా కవితకు ప్రజల్లో గుర్తింపు ఉందన్నారు. అయితే, తొలి సమావేశంలోనే తండ్రిని తిట్టడం మర్యాద కాదన్నారు.

### పెట్రోల్, డీజిల్ బండ్లకు భవిష్యత్ లేదు..



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** పెట్రోల్, డీజిల్ వాహనాలకు భవిష్యత్తు లేదని, వాహన తయారీదారులు హైడ్రోజన్, ఇథనాల్, సీఎన్జీ, ఎల్ఎన్‌జీ, ఎలక్ట్రిక్ వాహనాలవైపు మళ్లాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మంగళవారం జరిగిన బస్ వరల్డ్ ఇండియా 2026 కాంక్లేవ్ లో ఆయన మాట్లాడారు.

## ఢిల్లీ హైకోర్టులో షాకింగ్ ఘటన..

**అక్షరటుడే, న్యూఢిల్లీ:** న్యాయస్థాన విచారణలో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని బెంచ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేసులను విచారిస్తుండగా, ఒక్కసారిగా తెరపై అశ్లీల దృశ్యాలు ప్రత్యక్షమై అందరినీ దిగ్భ్రాంతికి గురిచేశాయి. ఆన్‌లైన్ వేదికగా విచారణ సాగుతున్న సమయంలో, గుర్తుతెలియని వ్యక్తులు విచారణా ప్రక్రియలోకి చొరబడ్డారు. అధికారులు వెంటనే స్పందించి ప్రసారాన్ని నిలిపివేసినప్పటికీ, తిరిగి విచారణ మొదలుపెట్టిన ప్రతిసారీ అశ్లీల వీడియోలు ప్లే అయ్యాయి. ఇలా మూడు సార్లు జరిగిన తర్వాత, చివరికి తెరపై "మీరు హ్యాక్ అయ్యారు" అనే సందేశం ప్రత్యక్షమైంది. దీంతో చేసేదేమీ లేక అధికారులు వర్చువల్ విచారణను రద్దు చేశారు.

## ఘోర రోడ్డుప్రమాదం.. ఆరుగురు మహిళలు మృతి

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** అతివేగంతో ప్రయాణికులతో వెళ్తున్న ఒక ప్రైవేటు బస్సు వ్యాన్‌ను ఢీకొట్టింది. దీంతో వ్యాన్‌లో ఉన్న ఆరుగురు మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన గుజరాత్‌లోని సబర్కాంత జిల్లాలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. ప్రమాదంలో మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. వ్యాన్ పూర్తిగా ధ్వంసం కావడంతో అందులో చిక్కుకున్న బాధితులను బయటకు తీయడానికి సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.

**పదో తరగతి ఫలితాల్లో బాలికల హవా కొనసాగింది. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం మధ్యాహ్నం రిజల్ట్స్ రిలీజ్ చేసింది. ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. ఈ ఫలితాల్లో మొత్తం 95.15 శాతం ఉత్తీర్ణత నమోదు అయింది. ఇందులో బాలికలు 96.26 శాతం, బాలురు 94.07 శాతం పాస్ అయ్యారు. ములుగు జిల్లా 99.30 శాతం ఉత్తీర్ణతతో టాప్‌లో నిలవగా.. 89.23 శాతంతో హైదరాబాద్ చివరన నిలిచింది.**

—అక్షరటుడే, హైదరాబాద్



# 'పది' ఫలితాలు విడుదల

■ 95 శాతం ఉత్తీర్ణత నమోదు ■ టాప్‌లో ములుగు.. లాస్ట్‌లో హైదరాబాద్

విద్యార్థులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్న పదో తరగతి పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. తెలంగాణ ఎస్సెస్సీ బోర్డు మధ్యాహ్నం రెండు గంటలకు ఫలితాలను రిలీజ్ చేసింది. హైదరాబాద్‌లోని ఎస్‌సీఈఆర్‌టీ ప్రాంగణంలో రిజల్ట్స్ ప్రకటించారు. మొత్తం 5,26,166 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 4,97,312 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. దాదాపు నెల రోజుల పాటు పదో తరగతి పరీక్షలు జరిగాయి. మార్చి 13న ప్రారంభం అయిన పరీక్షలు ఏప్రిల్ 14 వరకు కొనసాగాయి. అయితే విద్యాశాఖ అధికారులు జవాబు పత్రాల మూల్యాంకనం వేగంగా చేపట్టారు. దీంతో పరీక్షలు పూర్తయిన 15 రోజుల్లోనే ఫలితాలు విడుదల అయ్యాయి.

### మే మొదటి వారంలో అనుకున్నా..

తొలుత మే మొదటి వారంలో ఫలితాలు రిలీజ్ చేయాలని అధికారులు భావించారు. ఇంటర్, పాలిటెక్నిక్ లాంటి కోర్సుల్లో ప్రవేశాలకు వీలుగా ఈ నెల 29నే ఫలితాలు విడుదల చేశారు. విద్యార్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్లలో చూసుకునేలా విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. బీఎస్ఈ తెలంగాణ, మన బడి వెబ్‌సైట్లలో ఫలితాలను అందుబాటులో ఉంచింది. అంతేకాకుండా 8096958096 అనే నంబర్ ద్వారా కూడా ఫలితాలు తెలుసుకునే ఛాన్స్ కల్పించింది.

### జూన్ 5 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

విద్యార్థులు ఈ నెల 30 నుంచి మే 15వరకు రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఫెయిల్ అయిన విద్యార్థులకు జూన్ 5 నుంచి 12వ తేదీ వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తారు. ఇందుకోసం ఈ నెల 30 నుంచి మే 14వరకు ఫీజు చెల్లించాలి.

### సర్కారు బడుల సత్తా

రాష్ట్ర వ్యాప్తంగా 5,713 పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత నమోదు కావడం గమనార్హం. ఆరు ప్రైవేటు పాఠశాలల్లో మాత్రం అందరు విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. సామాజిక సంక్షేమ రెసిడెన్సియల్ పాఠశాలల్లో 99.10శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. ప్రభుత్వ పాఠశాలల్లో 86.18శాతం, జిల్లా పరిషత్ పాఠశాలల్లో 93.53 శాతం, మోడల్ స్కూల్స్‌లో 97.83శాతం, కేజీబీవీల్లో 98శాతం విద్యార్థులు పాస్ అయ్యారు. ప్రైవేటు స్కూల్స్‌లో 95.81శాతం చొప్పున ఉత్తీర్ణత నమోదైంది. 2,065 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శతశాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

## కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ పెద్ద బోగస్..: హరీశ్ రావు



**అక్షరటుడే, హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వేళ చెప్పిందొకటి.. అధికారంలోకి వచ్చాక చేస్తున్నది మరొకటి అని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ అనేది పెద్ద బోగస్ అని వ్యాఖ్యానించారు. పంటల కొనుగోళ్లపై సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. తాలు పేరిట తరుగు తీస్తే తోలు తీస్తా అన్న సీఎం రేవంత్ రెడ్డి.. ప్రస్తుతం వడ్ల కొనుగోలు కేంద్రాల్లోకి వెళ్లి చూడాలన్నారు. కేంద్రాలకు ధాన్యం కుప్పలు తెప్పలుగా వస్తున్నా ఇంకా కొనుగోళ్లు ఎందుకు మొదలుపెట్టలేదని ప్రశ్నించారు. మిల్లుల దగ్గర కూడా బస్తాకు కిలో, రెండు కిలోల తరుగు తీస్తూ రైతులను దోచుకుంటున్నారని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అన్ని రకాల పంటలను మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ అలుపెరుగని పోరాటం చేస్తామని చెప్పారు.

## మానవాళికి పొంచి ఉన్న అతిపెద్ద ముప్పు ఏఐ: మస్క్




**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** కృత్రిమ మేధ (ఏఐ) భవిష్యత్తుపై టెస్లా అధినేత ఎలాన్ మస్క్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏఐ అనేది మానవాళికి ఒక అద్భుతమైన సాధనంగా మారొచ్చు లేదా ఊహించని అతిపెద్ద ముప్పుగా పరిణమించవచ్చని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కాలిఫోర్నియా కోర్టులో ఓపెన్ ఏఐపై సాగుతున్న దావా విచారణ సందర్భంగా మస్క్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న తీరును చూస్తుంటే భవిష్యత్తు భయంకరంగా ఉండబోతోందని మస్క్ హెచ్చరించారు. సరిగ్గా నియంత్రించకపోతే "ఏఐ మనందరినీ చంపేయగలదు" అని ఆయన కుండబద్దలు కొట్టారు. హాలీవుడ్ చిత్రం 'టర్మినేటర్'లో చూపించినట్లుగా, యంత్రాలు మానవాళిపై తిరగబడే చీకటి రోజులను మనం నివారించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.



## ఇరాన్‌పై ట్రంప్ వ్యూహం.. ఆర్థిక దిగ్బంధమే లక్ష్యం!

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** హర్మూజ్ జలసంధి అంశంలో అమెరికాఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. తాజా పరిణామాల ప్రకారం.. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై ప్రత్యక్ష యుద్ధం కంటే 'దీర్ఘకాలిక ఆర్థిక దిగ్బంధనం' వైపే మొగ్గు చూపుతున్నారు. ఇరాన్‌ను లొంగదీసుకోవడానికి సైనిక దాడుల కంటే ఆర్థికంగా దెబ్బతీయడమే సరైన మార్గమని భావిస్తున్నారు. హర్మూజ్ జలసంధిని దిగ్బంధించడం ద్వారా ఇరాన్ ప్రధాన ఆదాయ వనరైన చమురు ఎగుమతులను పూర్తిగా అడ్డుకోవాలని అమెరికా ప్లాన్ చేస్తోంది. సైనిక చర్య వల్ల జరిగే నష్టం కంటే, ఆర్థిక సంక్షోభం వల్ల ఇరాన్ ప్రభుత్వం ఎక్కువ ఒత్తిడికి లోనవుతుందని ట్రంప్ యంత్రాంగం భావిస్తోంది. అమెరికా గనుక కయ్యానికి వస్తే తమ మిత్ర పక్షాలతో కలిసి అమెరికా యుద్ధ నౌకలను సముద్రంలోనే భస్మం చేస్తామని హెచ్చరించింది.

## టాప్ 10 జాబితా నుంచి ఇన్ఫోసిస్ అవుట్




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** కృత్రిమ మేధ ప్రభావంతో ఐటీ, డేటా సర్వీసెస్ రంగంలో సంక్షోభం నెలకొంది. 'యాంత్రోపిక్' తన 'క్లాడ్' మోడల్ ఆధారంగా రూపొందించిన కొత్త ఏఐ ఆటోమేషన్ టూల్స్ సంక్షోభానికి ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నుంచి ఎదురవుతున్న సవాళ్లతో సంప్రదాయ ఐటీ సేవలు అందించే కంపెనీలు కుదేలవుతున్నాయి. ఇన్ఫోసిస్ టాప్ 10 జాబితాలో చోటు కోల్పోయింది. ఎల్ఐసీ తొలిసారి ఆ జాబితాలో చోటు సంపాదించుకుంది. ఆ కంపెనీ మార్కెట్ క్యాప్ ప్రస్తుతం రూ. 5.19 లక్షల కోట్లుగా ఉంది. కాగా ఈ జాబితాలో రిలయన్స్ రూ. 19 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్ తో అగ్రస్థానంలో ఉంది.


## శ్రీలీల కంటే ఎక్కువ పారితోషికం..!



**టాలీవుడ్‌లో ఐటమ్ సాంగ్స్ హవా కొనసాగుతోంది. రామ్ చరణ్ నటించిన 'రంగస్థలం' చిత్రం కోసం దర్శకుడు సుకుమార్ అప్పట్లో పూజా హెగ్డేను ఎంపిక చేయగా.. ఆ తర్వాత 'పుష్ప' కోసం సమంత రూత్ ప్రభు, శ్రీలీలలను సెలెక్ట్ చేశారు. చిరంజీవి తన 'విశ్వంభర' చిత్రంలో మౌని రాయ్‌తో కలిసి స్టెప్పులేశారు. ఇక రామ్ చరణ్ తదుపరి చిత్రం 'పెద్ది' విషయానికి వస్తే.. శృతి హాసన్‌ను ఫైనల్ చేశారు. అయితే పుష్ప 2 చిత్రానికి శ్రీలీల రూ. 2 కోట్ల పారితోషికం చెల్లించారు. కాగా.. తాజాగా 'పెద్ది' మూవీ కోసం శృతి హాసన్ తన పారితోషికాన్ని భారీగా పెంచినట్లు తెలుస్తోంది. ఈ సాంగ్ కోసం రూ. మూడు కోట్లు తీసుకున్నారని ప్రచారం జరుగుతోంది.**


—అక్షరటుడే, సినిమాడెస్క్

## బెంగాల్ ఎన్నికల్లో 'గుర్తు' రచ్చ..!



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పశ్చిమ బెంగాల్‌లో రెండో దశ పోలింగ్ సందర్భంగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. డైమండ్ హార్బర్‌లోని ఫల్తా నియోజకవర్గంలో పలు పోలింగ్ కేంద్రాల్లో అవకతవకలు జరుగుతున్నాయంటూ భారతీయ జనతా పార్టీ తీవ్ర ఆరోపణలు చేసింది. బీజేపీ పశ్చిమ బెంగాల్ కోఇన్‌ఛార్జి అమిత్ మాలవీయ సోషల్ మీడియా వేదికగా కొన్ని వీడియోలను విడుదల చేశారు. ఓటింగ్ యంత్రాల్లోని 'కమలం గుర్తు' (బీజేపీ గుర్తు) కనిపించకుండా అధికారులు దానిపై టేపులు అంటించారని ఆయన ఆరోపించారు. దీనివల్ల ఓటర్లు బీజేపీకి ఓటు వేయకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. అధికార తృణమూల్ కాంగ్రెస్ నేతలు స్థానిక యంత్రాంగంతో చేతులు కలిపి ఈ అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. గతంలో అభిషేక్ బెనర్జీ విజయం సాధించినప్పుడు కూడా ఇలాంటి అప్రజాస్వామిక వ్యూహాలనే అనుసరించారని ఆయన గుర్తు చేశారు. ఈ ఘటనపై ఎన్నికల కమిషన్ (ఈసీ) రంగంలోకి దిగింది. బీజేపీ ఆరోపణలు నిజమని తేలితే, ఆయా బూత్‌లలో రీపోలింగ్ నిర్వహిస్తామని అధికారులు వెల్లడించారు.

## తెలంగాణలో పెరిగిన ఉష్ణోగ్రతలు



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంపై భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. ఉదయం 9 గంటలు దాటిందంటే చాలు ఎండ తీవ్రత విపరీతంగా పెరుగుతోంది. దీంతో ప్రజలు బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. ఉత్తర, తూర్పు తెలంగాణలో వడగాలులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నేడు ఉష్ణోగ్రతలు 45.5 డిగ్రీల కంటే ఎక్కువగా నమోదవుతున్నాయి. రాష్ట్రంలోని చాలా అంతర్గత ప్రాంతాల్లో వేడి పొడి వాతావరణం కొనసాగుతోంది. దీంతో ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. హైదరాబాద్ నగరంలో ఉష్ణోగ్రతలు నేడు సుమారు 42-43 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉంది. అయితే నగర శివారు ప్రాంతాల్లో ఇవి 44 డిగ్రీల మార్కును దాటే ఛాన్స్ ఉంది. మధ్యాహ్న సమయంలో వేడి తీవ్రత అధికంగా ఉంది.